కథ

# రాయితీ

**ఎనిమిదేళ్ళొచ్చాయి వర్ధనికి. వెంకటాపురం దివాణం ఆస్థాన పండితుడు కృష్ణశాస్త్రిగారికి ఆరుగురు అబ్బాయిల తరువాత అపురూపంగా పుట్టిన అమ్మాయే వర్ధని. పిల్ల భూమ్మీదపడగానే పంచాంగం తెరిచారు పంతులుగారు.**

అవి మునుపటి రోజులు. ఈ రోజుల్లోనైతే శాస్త్రిగారు అల్ట్రా సౌండు చేయించి అమ్మాయే నని ధృవీకరించుకొని, స్వయంగా ముహూర్తం పెట్టి ఆ సుముహూర్తపు వేళకే సిజేరియన్ చేయించేసేవారు. కానీ ఏం లాభం అప్పుడిటు వంటి వెసలుబాట్లు లేవు.

భార్యకు నొప్పులు మొదలవగానే నడవలో పచార్లు మొదలుపెట్టారు. అబ్బాయిలందరు అక్కడి నుంచి తప్పుకున్నా పెద్దవాడు మాత్రం కొంచెం ధైర్యంగా నాన్నగారి దగ్గరికి వచ్చి ''ఈసారైనా చెల్లెలు పుట్టుందం టావా నాన్నా. లేకుంటే మళ్ళీ మన క్రికెట్ టీమ్ మెంబరేనా?'' అన్నాడు.

''నాకు మాత్రం ఏం తెలుసురా, అంతా భగవంతుడి దయ. మనకు ప్రాప్తం వుందో లేదో. అయినా ఒరేయ్ నువ్వెందుకిక్కడ వెళ్ళి తమ్ము ళ్ళను చూసుకోపో'' అబ్బాయి అలా వెళ్ళగానే ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ వచ్చింది మంత్రసాని. ''ఈసారి అమ్మాయేనండి. సాక్షాత్తు లక్ష్మీదేవిలాగుంది. ఐదు వరహాలకన్నా తక్కువిస్తే వప్పుకునేది లేదు'' అంటూ వచ్చి నంత వేగంగా మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయింది.

వెంటనే పంచాంగం తెరిచి చూసి నా చిట్టితల్లి ఎంతమంచి నక్షత్రంలో పుట్టిందో, ఐదు వరహా లేమిటీ నేనే దివాణం రాజుగారినైతే ఐదూళ్ళే రాసి చ్చేవాణ్ణి అనుకుంటూ నవ్వుల వర్షం కురిపిస్తూ బయలుదేరారు ఈ శుభవార్త అందరితో పంచు కోడానికి. దివాణం నుంచి రాణీగారు స్వయంగా తల్లిదండ్రులకు పట్టుబట్టలు, పాపాయికి బంగారం మురుగులు, గొలుసు పట్టుకొచ్చారు. చిదిమి దీపం పెట్టుకోవచ్చు, రాణీవాసంలో వుండవలసిన పిల్ల అంటూ పాపను ఎత్తుకుని తానే స్వయంగా గాజులు తొడిగి గొలుసు మెడలో వేశారు. దినదిన ప్రవర్ధమానంగా పెరిగి పెద్దకావా లని, తల్లి పేరు కలిసొస్తుందని పిల్లకు వర్ధని అని నామకరణం చేశారు. ''నోరు తిరగని పేరు పెట్టా రేంటి నాన్నగారూ'' అని అన్నలు ఒకటే గోల.

''అలాగే పిలవాలని ఎక్కడుందిరా, వరం అనో వరాలు అనో పిలవండి. మా అమ్మ పర్వతవర్ధ నమ్మ పేరు మాత్రం మార్చేది లేదు'' అంటూ తాను మాత్రం 'చిట్టితల్లీ, బంగారు బొమ్మా' అనే పిలిచేవారు.

ఆ దివాణంలో దేవకన్య మాదిరి పెరిగి పెద్ద దైంది వరాలు. వరాలుకు ఎనిమిదో ఏడు రాగానే శాస్త్రిగారి గుండె గుభిల్లుమనింది. 'అష్టవర్షాత్ భవేత్ కన్యా' అని మనవాళ్ళువూరికే అన్నారా? తనకింక పెళ్ళి చేయాలికదా. ఎవరూ ఒక పట్టాన నచ్చేవారుకాదు శాస్త్రిగారికి. ఏ జాతకమూ నచ్చేది కాదు. అథవా ఏదైనా నచ్చితే, కాకిము క్కుకు దొండపండు వలే పిల్లవాడు అనాకారో, ఏదో అనాచారమో కన్పించేవి శాస్త్రిగారికి.

''చూడబోతే మీ అమ్మాయికి పెళ్ళి చెయ్య రేమో'' అనేది శాస్త్రిగారి ధర్మపత్ని కామా క్షమ్మ. ''ఛీ..ఛీ..ఛీ..అప్రాచ్యపు మాటలూ నువ్వు. పెళ్ళి చేయనని నేనన్నానా, ఏదీ ఒక్క టంటే ఒక్క సంబంధం. దానికి అన్ని విధాలా సరిపోయింది లేదు కదా. ఏదో వొకటి అని సర్దు కుపోవలసిన ఖర్మేం దానికి. కన్నొంకరా, కాలొం కరా, నీ పిచ్చి వాగుడు కట్టిపెట్టు'' చిన్నగా విసు క్కున్నారు భార్యపైన.


ఎట్టకేలకు వచ్చింది జగపతిరావుగారి సంబంధం. పిల్లవాడు పనసతొనలాగుంటాడు. వేదాలు చదువుతూనే లౌకికంగా కావలసిన చదు వులు చదువుతున్నాడు. పదునాలుగేళ్ళ వయసు. స్కూలు ఫైనలు యిస్తాడు ఈ సంవత్సరమే. జమీందారీ ఫాయా కుటుంబం వారిది. ఒక్కడే సంతానం. ఇక జాతకం చూద్దామా అంటే వర్ధని కోసమే పుట్టాడా అన్నట్లుంది. ఏమో మంచి సంబంధం అన్న మోజులో తనే ఏమైనా పొరపా టుగా చూశాడా. సందేహనివృత్తి కోసం దివాణం లోని మిగతా పండితులకు చూపించాడు జాతకా లను. అందరు భేషుగ్గా వున్నాయన్నారు. తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు శాస్త్రిగారు. పిల్లను చూడటం అన్నది కేవలం ఒక తంతు. పిల్లనచ్చక పోయే ప్రసక్తేలేదు. పచ్చని పట్టుపరికిణీపైన మంకెన పువ్వురంగు బ్లవుజు, పొడుగాటి జడచి వరి జడగంటల చిరుసవ్వడికి, కాలిగజ్జెలు తమ వంతు సందడిని జత చేస్తూ గలగల చప్పుళ్ళతో వర్ధని రాగానే పద్నాలుగేళ్ల విశ్వానికే వళ్ళు ఝల్లు మనింది.

ఎంతో వైభోగంగా పెళ్ళి జరిగింది. మెరవణీ కవి రాజావారు తమ రోల్సురాయిస్ కారు పంపిం చారు. ఆ పెట్రోమాక్సు లైట్ల కాంతుల్లో పిల్లలి ద్దరూ రతీమన్మథుల్లా వున్నారు. కారు నెమ్మదిగా నడుస్తోంది. కారు పక్కనే శాస్త్రిగారు నడుస్తు న్నారు. ఉన్నట్టుండి విశ్వం ఎంతో సిగ్గుగా మామ గారితో ''ఈ అమ్మాయి నిద్రపోతున్నట్లుంది. నా భుజం మీద వాలిపోతోంది'' అని చెప్పాడు. పక్కనే నడుస్తున్న అమ్మలక్కలెవరో ఆ మాటలు విన్నారు కాబోలు. ''అయ్యో, అయ్యో అప్పుడే మొదలైనాయా చాడీలు'' అంటూ పరాచకమాడారు. అసలే సిగ్గు పడు తున్న విశ్వం మరింత సిగ్గుతో తల వంచే సుకున్నాడు రెండో పెళ్ళి కూతురి లాగా.

మూడు నిద్దర్లకు విశ్వం వాళ్ళ వూరెళ్ళారు. కోడలికి పెట్టిన నగ పెట్టకుండా పెట్టి మురిసిపోయింది మీనాక్షమ్మ. ఆడపిల్లలు లేని వారేమో, వరాలు అక్కడ వున్న మూడు రోజులు ఆ పిల్లతోడితే లోకంగా మురిసిపోయారు మీనాక్షి జగపతిరావు దంప తులు. మీనాక్షమ్మకైతే ఇక వేరే లోకమే లేదు. స్నానం చేయించుకోవడానికి వరాలు యిష్టపడక పోవడంతో అది మినహా అన్ని పనులు తనే చూసుకుంది. జడవేసి పువ్వులు కుట్టడం, పొదరు అద్ది బొట్టుపెట్టడం, గోరంటాకు పెట్టి, ఆ చేత్తో అన్నం తినలేదన్న నెపంతో గోరుము ద్దలు చేసి నోట్లో పెట్టడం, అన్నీ ఆవిడే చూసు కునేది. ఇదంతా చూసిన విశ్వానికి ఈ పెళ్ళి ఎందుకు చేసుకున్నాను, ఈ పిల్లను ఎందుకు తీసుకువచ్చారు అని కొంత అసూయ కలిగింది. మూడు రోజులు కాగానే వర్ధని పుట్టింటికి ప్రయాణం అయింది. కూతుర్ని అత్తగారింటికి పంపుతున్నట్లే కళ్ళనీళ్ల ధారలు కారుతుండగా వర్ధనిని పుట్టింటికి పంపారు మీనాక్షమ్మ దంప తులు.

విశ్వం చదువుతో బిజీ ఐపోయాడు. ఈ పెళ్ళి తతంగం అంతా మరిచిపోయాడు అనడం కన్నా వెనకకు నెట్టేసి తన చదువుపై దృష్టి మరల్చాడు అనడం సబబు. ఇంటర్ ఫస్టు క్లాసులో పాసై నాడు. వర్ధని అదృష్టం అన్నారంతా. ఇంజనీరింగు చదువుతానని ఒకటే పట్టు. ఎన్ని తరాలు కూర్చొని తిన్నా తరగని ఆస్తి. మనకెందుకురా వుద్యోగాలు అని నచ్చచెప్ప చూశారు.

''ఉద్యోగం పురుష లక్షణం నాన్నా. నేను చదివే తీరాలి. అప్పుడే యేమైంది విదేశాలకు కూడా



వెళ్ళి చదవాలి'' అంటూ మంకుపట్టు పట్టాడు.

''ఇంకా చదువులంటే ఎట్లా, వరాలు పెద్దమనిషి కూడా అయిందట. మరి ఆ కార్యం కూడా కానిచ్చేస్తే బాగుంటుందేమో'' భర్తతో గుసగుసలాడింది మీనాక్షమ్మ. అటువంటిదేమీ వల్లకాదు పొమ్మన్నాడు.

ఇప్పుడు మద్రాసు వెళ్ళి చదువుకోవాలిగదా ఒక్కసారి వెంకటాపురం వెళ్ళి మీ అత్త మామల్ని చూసిరా. మళ్ళీ ఎప్పుడు వీలవుతుందో ఏమో. వాళ్ళు కూడా నిన్ను చూడాలని అనుకుంటున్నారు అంటూ ప్రయాణం కట్టించారు విశ్వాన్ని. మనసులో మాత్రం మహాలక్ష్మి లాంటి వరాలును చూస్తే మనసు మార్చుకోకపోతాడా అన్న ఆశతో.

ఘనంగా ఆహ్వానించారు అత్తమామలు, బావమరుదులు. కొండంత సిగ్గుతో తళుక్కుమని మెరిసి మాయమయింది వరాలు. చదువుపైనే లగ్నమైన మనసు ఒక్కక్షణం వరాలు వైపు మొగ్గినా అంతలోనే తనను తాను సంభాళించుకున్నాడు.

ఎలాగయినా వరాలుతో ఒంటరిగా మాట్లాడాలని చిన్న బావమరిది ప్రసాదు సాయం కోరాడు. ''అబ్బే దాందేముంది. నీవు వేణుగోపాలుని ఆలయం దగ్గరవుండు, నేను వరాలును తీసుకొస్తాను. కానీ పది నిమిషాలే సుమా, ఆలస్యం అయితే అమ్మ వెతుక్కుంటూ వచ్చేస్తుంది''

అలాగేనంటూ గుడికి వెళ్ళాడు విశ్వం. వర్ధని వచ్చింది. తనను చూసేసరికి చెప్పాలనుకున్నవన్నీ మరిచిపోయాడు. వయసు తెచ్చిన కొత్త కొత్త అందాలతో వరాలు దేవకన్యలాగుంది. చదువుకు స్వస్తి చెపుదామన్న ఆలోచన కూడా ఒక్కక్షణం మనసులో మెరిసింది-కానీ...

''ఏం మాట్లాడాలో మాట్లాడండి. మరి ఆలస్యం చేస్తే అమ్మ వచ్చేస్తుంద''ని తొందరచేశాడు ప్రసాదు. తాను ఆంజనేయ స్వామి గుడి వైపు నడుస్తూ.

''కూర్చోవర్ధనీ...నాకు చదువంటే చాలా యిష్టం. నువ్వంటే కూడా చాలా యిష్టం. ఇప్పుడైతే చదువుకునే టైము. సమయం దాటితే మళ్ళీ చదువుకోలేం కదా, అందుకనే ఇంజనీరింగు చదువుదామని మద్రాసు వెళ్లాలనుకుంటున్నాను. నేను ఇంజనీరవుతే మన పెళ్లిలో ఎక్కామే రాజా వారి కారు, అలాంటి కారు మనం కూడా కొనుక్కోవచ్చు. ఇంకా బోలెడన్ని చోట్లకెళ్లొచ్చు. నేను ఇంజనీరింగ్ కాగానే వచ్చి నిన్ను మనింటికి తీసుకుపోతాను. ఏమంటావ్ నువ్వు'' ఎవరో తరుముకొస్తున్నట్లు తను చెప్పదలుచుకున్నదేదో గబగబా చెప్పేశాడు.

అలాగే అని తలూపింది వరాలు.

''ఏదైనా నీ నోటితో చెప్పు. మరి నీ మాట నేనసలు వినలేదు గదా''

''మీకేది ఇష్టమయితే నాకూ అదే యిష్టం'' అంటూ రాబోయే అన్యోన్య దాంపత్యానికి నాందీవాక్యం పలికింది వర్ధని. ఎంతో సంతోషంగా యింటికి వచ్చారు అందరు. ఇంజనీరింగ్ చదవబోయే అల్లుడికి పట్టు బట్టలు పెట్టటం ఎంత సమంజసం అని కొట్టుమిట్టాడి చివరకు ఇటు సాంప్రదాయానికి అటు పురోగమనానికి సంధి కలుపుతూ పేంటు, షర్టు బట్టలపైన పట్టు పైపంచ పెట్టారు శాస్త్రి గారు. మామగారి లౌక్యానికి ఎంతో ముచ్చటపడ్డాడు విశ్వం.

నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. విశ్వం మద్రాసులో వున్నప్పుడు అడపాదడపా వర్ధని అత్త వారింటికి వెళ్ళి వస్తుండేది. మీనాక్షమ్మకు ఒంట్లో బాగాలేదని తెలిసి అక్కడికి వెళ్లిన వర్ధని అత్తగారిని కంటిపాపలా చూసుకుంది. వంటకు, పనులకు ఇంటినిండా మనుషులున్నా, తన వారన్న వారుండడమే అనారోగ్యంలో వున్నవారికి

**విరూరు రుక్మిణి**

పరమౌషధం. చిన్నపిల్లయినా అత్తగారికి సమయానికి కావలసినవన్నీ చూసుకుంటూ ఆ యింటి వాతావరణానికి కూడా అలవాటు పడిపోయింది వర్ధని.

ఒకప్పుడు పరిగెత్తినట్లు అనిపించినా, ఒకప్పుడు నత్తనడక సాగించినా కాలం మాత్రం తనపని తాను చేసుకుంటూ సాగిపోయింది. విశ్వం ఇంజనీరింగు పూర్తి చేసి ఇంటికి వచ్చాడు. ఇక మారు మాట్లాడనివ్వకుండా శోభనం ఏర్పాట్లు చేయించింది మీనాక్షమ్మ. పై చదువులకు విదేశాలకు వెళ్ళాలని వున్నా అతని అభిప్రాయం అడిగిన వాళ్లే లేరు. ఆ ఛాన్సు అతనికి ఇవ్వదలుచుకోలేదెవ్వరు. వర్ధని ఆకర్షణ ఎంత బలంగా వుందంటే ఛాన్స్ వున్నా అటువైపు మొగ్గేవాడు కాదేమో. వెంకటాపురంలో మూడు రాత్రులు గడిపి ఇంటికి వచ్చేసరికి ఉన్న వూర్లోనే వుద్యోగం వచ్చిందని వార్త విశ్వాన్ని ఆనందంలో ముంచెత్తింది. కోడలు వచ్చిన వేళావిశేషం అని తనకు తెలిసినవన్నీ దిగదుడిచి వేసింది మీనాక్షమ్మ.

ఉద్యోగం చేస్తూనే అమెరికాకు అప్లై చేస్తున్నాడు విశ్వం. ఈ సంగతి వర్ధనికి తప్ప మరెవ్వరికి తెలియనియ్యలేదు. ఆ అవకాశం కూడా అతణ్ణే వెతుక్కుంటూ వచ్చింది.

''వర్ధనీ ఏం చెయ్యను అమ్మానాన్నలతో ఎట్లా చెప్పను'' తెగ మధనపడిపోయాడు విశ్వం.

''మీరూరుకోండి నేను చెబుతాగా'' అంది వర్ధని.

మామగారు, భర్త భోజనాలవగానే టీవీ దగ్గర చేరారు. వర్ధని మీనాక్షమ్మ పక్కన చేరింది.

''అత్తయ్యా, మీ మనవడు ఎంతదృష్టవంతుడో చూశారా, వాడు కడుపున పడగానే వాళ్ళ నాన్నగారికి ఎన్నాళ్ళనుంచో అనుకున్న విదేశాల ఛాన్సు వచ్చింది'' అంది సిగ్గుతో తలదించుకొని.

'మనవడు' అన్నమాట తప్ప ఇంకేమీ మీనాక్షమ్మ చెవికెక్కలేదు. వరాలును దగ్గరకు తీసుకుని నుదుట ముద్దుపెట్టుకుంది. మనవడు పుట్టబోతున్నాడని సంతోషించాలో, విశ్వం దూరంగా వెళ్లిపోతున్నాడని దిగులుపడాలో తెలియక సతమతమైపోయింది మీనాక్షమ్మ. ''రెండేళ్ళంటే ఎంతసేపత్తయ్యా, ఇక్కడ మీకసలు మనవడితో టైం తెలుస్తుందా'' అంటూ వూరించింది.

నిజమే, ఇప్పటినుంచి వర్ధనిని కాలుకింద పెట్టకుండా చూసుకోవాలి, మనవడు పుట్టిన తరువాత సరేసరి. కానీ..వర్ధని పుట్టినింటికి వెళ్ళిపోతేనో. ఆమె మనసు చదివినట్టే ''నేను కాన్పుకు కూడా వెంకటాపురం వెళ్ళనత్తయ్యా, అక్కడ డాక్టరు వసతి లేదుగదా, అవ్వమ్మనే ఇక్కడికి రమ్మందాము''



''మా తల్లే, మా అమ్మే'' అంటూ బుగ్గలు పుణికింది.

''ఇంక ఆ టీవీ కొంచెం కట్టిపెట్టారూ?'' అంటూ పరిగెత్తినట్లే హాల్లోకి వచ్చింది మీనాక్షమ్మ. ''అరే అబ్బాయ్ ఎప్పుడు నీ ప్రయాణం'' అని అడిగే అమ్మను చూసి విస్తుపోయాడు. మనసులోనే వర్ధనిని మెచ్చుకున్నాడు కూడా అమ్మను ఇంత తొందరగా వప్పించినందుకు.

''ఇంకెన్నాళ్లులేండి ఈ టీవీలు. బుజ్జిగాడు ఇంట్లో తిరుగుతూవుంటే ఇంక టీవీలేం చూస్తారు''

తండ్రి కొడుకులిద్దరు తెల్లబోయారు ఆ మాటలకు అర్థం తెలీక.

''వాడంటే పసివాడు, వాడికర్థంగాలే, మీకేమయిందీ, మనవడు పుడ్తాడన్నమాట వినేసరికి మతిపోయిందా'' దీర్ఘం తీసింది మీనాక్షమ్మ.

ఒకేసారి రెండు ట్యూబులైట్లూ వెలిగాయి. అమ్మ నాన్న వున్నారని కూడా ఆలోచించకుండా 'నాతో మాట మాత్రం అనలేదే' అని వర్ధనిని నిలదీశాడు విశ్వం.

''ఇవన్నీ నీకెట్లా చెబుతుందిరా, ఆడవాళ్ల సంగతులు. దాన్నేమీ అనకు.''

''అన్నట్టు రేపటినుండీ మన నల్లావు పాలన్నీ వర్ధనికే. మీరింకో ఆవును కొనుక్కోండి మీ కాఫీలల్లోకి పాలకోసం. రోజూ నాలుగు కొబ్బరిబోండాలు దింపించి ఇంటికి పంపమని చెప్పండి సీతయ్యతో. బజారుకెళ్ళి మాదీఫల రసాయనం పట్టుకురండి. వేవిళ్లు మొదలైతే కష్టం. అసలే దప్పికయినప్పుడు బావి తవ్వే రకం మీరు. అన్నట్టు మీ స్నేహితుడు కూతురు లేదూ డాక్టరు పిల్ల. దాన్నొక్కసారి వచ్చి చూసిపొమ్మని చెప్పండి. అయ్యో మరిచేపోయాను. బాత్‌రూమ్‌లో గచ్చు వూడిందిగదా తట్టుకుంటుందేమో, రేపే దాన్ని రిపేర్ చేయించండి'' ఇంకా యేమైనా మర్చిపోయేనేమోనని ఆలోచనలో పడింది . విశ్వం సంగతే లేదు.

పాస్‌పోర్టు, వీసా మొదలైన తతంగాలన్నీ పూర్తయ్యేసరికి రెండునెలల పైనే పట్టింది. విశ్వం ప్రయాణం రోజుకి వర్ధనికి ఐదో నెల. విడవలేక విడవలేక విడిచి వెళ్ళేడు.

అత్త గారాబంతోపాటు అమ్మ మురిపం కూడా తోడై విశ్వం దగ్గరలేని లోటు కొంత మరిచిపోయేట్టు చేశాయి. పండంటి కొడుకు

## కొత్త పాత్ర

**మీ అభిమాన హీరోయిన్ దియాని కామెడీ రోల్‌లో చూడాలనుకుంటే మీ కోరిక త్వరలో నెరవేరుతుంది. అర్జున్ రాంపాల్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రంలో దియా వెరైటీగా కామెడీ పాత్ర చేస్తోంది. నీరజ్ వోరా పర్యవేక్షణలో నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రంలో పరేష్ రావల్ మరో పాత్ర పోషిస్తున్నాడు. 'నీరజ్ మంచి స్క్రిప్ట్‌తో నన్ను కలిశాడు. మంచి కామెడీ ఉన్న పాత్ర నాకు సరిపోతుందని చెప్పడంతో నేను కాదనలేకపోయాను. నా కెరీర్‌కి ఈ చిత్రం మంచి ఊపునిస్తుంది. కేవలం గ్లామర్ పాత్రలతో పాటూ కామెడీని కూడా చక్కగా పండిస్తుందని నన్ను నేను నిరూపించుకుంటాను' అంటోంది దియా.**

పుట్టాడు. కొండవీటి చేంతాడంత పేరు కాకుండా అమెరికన్లు కూడా తేలికగా పలకగలిగే పేరు పెట్టండని రాశాడు విశ్వం. ''ఏం వీడు ఊరేగింది చాలకా నా మనవడు కూడా వెళ్ళాలా ఆ వూళ్ళేలడానికి- ఐనా మన పూర్వీకుల పేర్లేవీ లేకుండా ఎలా. వీడి మాటలకేంలే'' అని చాలా పెద్ద పేరే పెట్టారు. కానీ చివర్న మాత్రం విశ్వం కోరినట్టుగానే గగన్ అని పెట్టారు. మూడు సెమిస్టర్లలోనే ఎమ్.ఎస్. ముగించి వచ్చేశాడు విశ్వం. పి.హెచ్.డి. చేయాలని వున్నా కొడుకును విడిచి వుండటం అంత తేలికనిపించలేదు.

మళ్ళీ ఎందుకోగానీ వర్ధని కడుపు పండలేదు. ఒక్క కొడుకును అందరూ అపురూపంగా చూసుకుంటున్నారు. పిల్ల తల్లయినా వరాలు మాత్రం వాళ్లన్నదమ్ములకు ఇంకా గారాలకూచే. వదినలు కూడా వంత పలికేవారే దొరికారు. ఇంత అపురూపమైన అదృష్టం ఎవరికోగానీ లభించదు. అదృష్టమంటే వరాలుదే అని అందరు అనుకునేవారు. ఎవరి దృష్టి తగిలిందో ఏ దేవతలు ఆగ్రహించారోగానీ, ఆఫీసునుంచి తిరిగి వస్తున్న విశ్వం కారు ఆక్సిడెంటులో కాలం చేశాడు. వర్ధనిపైబడ్డ ఈ ఘోర విపత్తు తట్టుకోలేకపోయారో లేక తన జాతకం చూసే శక్తినే శంకించారోగానీ శాస్త్రిగారు త్వరలోనే అల్లుడి దోవే అనుసరించారు. భర్తను తండ్రిని కొద్ది వ్యవధిలోనే పోగొట్టుకున్న వర్ధని స్థబ్దురాలైపోయింది. ఈ దశలో మామగారు కన్న తండ్రికన్న మిన్నగా అండగా నిలిచారు. గగన్ ఆలనాపాలనా అంతా తన భుజాలపై వేసుకున్నారు. తాత, తండ్రి అన్నీ తానై పెంచారు వాడిని. మామలైదుగురు తమ పిల్లలకన్నా ఎక్కువగా చూసుకున్నారు గగన్‌ను. తండ్రి మాదిరి ఇంజనీరును చెయ్యాలని తాతగారికున్నా, గగన్ మాత్రం డాక్టరే చదువుతానని పట్టుపట్టాడు. పంతంలో తండ్రికేం తీసిపోడు ఈ కుర్ర సన్యాసి అని ముద్దుగా విసుక్కుంది నానమ్మ. గగన్ తరువాత రెండేళ్ళకు ప్రసాదు కూతురు తార కూడా మెడిసెన్‌లోనే చేరింది. ఇద్దరూ ఒకరంటే ఒకరు యిష్టపడటంతో ఏ ఆటంకాలు లేకుండా వాళ్ళ పెళ్ళి ఏర్పాట్లు జరిగిపోయాయి. పెళ్ళి టైములో మాత్రం వర్ధని పెళ్లి పందిరిలో వుండరాదని ఎంతో నేర్పుతో మనసు నొప్పించకుండా చెప్పించారు. ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి తండ్రి ఎలాగూ లేనే లేడు. ఉన్న తల్లి కూడా దగ్గర లేకుండా జరిగిపోయిందని వర్ధని మనసు మూలిగింది. మీనాక్షమ్మ మాత్రం దానికిలేని సుఖం నాకూ అక్షరలేదని వర్ధనితో పాటే దూరంగా వుండిపోయింది. కానీ వర్ధనిని మాత్రం పెళ్ళిపందిరిలో వుంచడానికి ఆమె సాంప్రదాయపు మనసు ఒప్పుకోలేకపోయింది.

వైధవ్యం అంటే విశ్వంలేని జీవితమే అనుకుంది గానీ ఇలా ఏ శుభకార్యాలూ చూడటానికి కూడా పనికిరాకుండా పోతానని కడకు ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి కూడా చూడడానికి నోచుకోలేదని అనుకోలేకపోయింది. అందుకే తరువాత యింట్లో ఎన్ని శుభకార్యాలు జరిగినా అన్నింటికీ వెళ్ళకుండా సున్నితంగా తిరస్కరించింది. అయినా వైధవ్యాన్ని ఇంత వికృతంగా తయారుచేసారు యెందుకో.

కన్నతల్లి చూపు పిల్లలకు చెడుపు చేస్తుందా. ఈ మూర్ఖపు ఆలోచనలు ఇంత వివేచన వున్న ఈ ఆధ్యాత్మిక భారతదేశంలో ఎలా చోటు చేసుకోగలిగాయి.

ఒక మనిషి చావుకు ఇంకో మనిషి ఎంత వరకు బాధ్యుడు? భర్త చావు ప్రభావం, భార్యపైన మానసికంగా, ఆర్థికంగా పడవచ్చుకానీ అన్ని అనర్థాలకు మూలకారణం అయ్యేంత వికృతమైన మార్పు ఆమెలో వస్తుందా. మరి భర్త పోతే భర్తలోనూ ఆ మార్పు రావాలికదా. అట్లా ఎవ్వరు అనరేం. ఎప్పుడొస్తుందో మన వైఖరిలో మార్పు.

ఆలోచనలలోనే కాల గమనాన్ని కూడా ఖాతరు చెయ్యలేదు తను. వచ్చిన మార్పులన్నింటిని తటస్థంగా చూస్తూ వుండిపోయింది.



కాల గతిలో వర్ధని వర్ధనమ్మగానూ, పలకలేని వారికి వరాలమ్మగానూ మారిపోయింది. కంటికి రెప్పలా కాచుకున్న మీనాక్షమ్మ దంపతులు కాలగర్భంలో కలిసిపోయారు. ఇప్పుడు గగన్ కొడుకు ఆయుష్ పెళ్లి ఎంతో ఆర్భాటంగా జరుగుతోంది. పూల పందిరిలో ఆయుష్ అంతా విశ్వంలా కన్పించాడు వర్ధని కళ్ళకు. ఈసారి మాత్రం వర్ధనమ్మ పెళ్ళి పందిరిలోనే వుంది. పైపెచ్చు అమ్మకు చూపు ఆనదు. దగ్గరగా వుండాలని పెళ్ళి వేదికపైనే కుర్చీ వేయించాడు గగన్. దగ్గరగా కూర్చొని మనవడి పెళ్లి కళ్ళారా చూసింది. ఆనందపడిపోయింది, ఆశీస్సులు వర్షించింది.

తన ఆలోచనలు మాత్రం తన్ను వదలటం లేదు.

ఆనాటికి ఈనాటికి తను విధవరాలే కదా. గగన్ పెళ్లినాటి అభ్యంతరాలు ఇప్పుడేమయ్యాయి.

ఇదంతా కాలంలో వచ్చిన మార్పా, లేకపోతే మనిషికి వయసుతోపాటు వచ్చే రాయితీలు వైధవ్యానికి కూడా వర్తిస్తాయా? కొడుకు పెళ్లి కళ్ళారా చూడలేకపోయిన తను మనవడి పెళ్లి మాత్రం ఇంత దగ్గరగా కూర్చొని ఆనందంగా చూడగలిగిందంటే తన శరీరానికే కాదు, తన వైధవ్యానికి కూడా వయసొచ్చింది అని తనలో తానే నవ్వుకుంది వర్ధనమ్మ-కాదు కాదు వరాలమ్మ.

✪

## వార్తల్లో తార

**బాలీవుడ్‌లో ఇప్పుడో తార గురించే చర్చ జరుగుతోంది. ఈ వార్తల్లో తార భూమిక. దక్షిణాదిన 'ఖుషి'చిత్రంలో నటించి అవార్డు కూడా గెల్చుకున్న ఈ అమ్మాయి ఇప్పుడు సల్మాన్‌ఖాన్‌కి కృతజ్ఞతలు చెబుతోంది. 'తేరే నామ్' చిత్రంలో ఆమె నటన అందర్నీ ఆలోచింపచేసింది. బాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలకు ఈ చిత్రం నాంది కాగలదని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి. అన్నట్టు భూమిక బాజీరావ్ మస్తానీలో కూడా నటిస్తోంది. తేరేనామ్ విడుదలై సంచలనం సృష్టించి భూమికని నెంబర్ వన్ హీరోయిన్‌గా మార్చేసింది. ఇటు బాలీవుడ్, అటు టాలీవుడ్ ప్రేక్షకుల కోసం ఆమె వెరైటీ పాత్రల్లో కన్పించడానికి ట్రై చేస్తోంది.**